

# అనగనగా ఓ మంచి కథ

## శ్రీకాకుళే మహాక్షేత్రే

- వేటూరి సుందర రామమూర్తి

('రచన' జనవరి 2003 సంచిక నుంచీ)

ఆ.. ఈ **శ్రీకాకుళంలో** మహాక్షేత్రంలో నాటి మాట ఇది. తెలుగు నాటి మాట. విశేషించి వెలనాటి మాట. వెలదీ కోవెలది అయిన ఆటవెలది మాట ఇది. దైవరాయడా దేవవేశ్యాభుజంగుడు. పోనీ.. ఆ దైవం రాయడా అంటే.. రాసే రాత నుదుట. ఎదుట పడి అడగాలంటే కొబ్బరి కొట్టిన రాయి. ఉలుకా పలుకా రాయడికి? కులుకు కూడబెట్టుకుని కూనసానులతో కూచిపూడి ఆడమంటే మాత్రం విటరాయడూ.. నటరాయడూ తెలుగు భర్త!

అనాడెప్పుడో రాయలవారికి నాలుగో జామున కల్లోకి కదిలి వచ్చాడట. ఆముక్తమాల్యద రాసి తనకిమ్మన్నాడట. 'కులపతి వెంకన్నగారికిద్దామనుకున్నానే.. ఇప్పుడెట్లా స్వామీ!' అంటే 'నాకన్న వెంకన్న ఎవరయ్యా రాయా - ఇంకా కన్ను తెరవలేదా?' అన్నాడట. ఆ రాయడి గుడి నీడలో వెలసిందో వాడ. ఆ వాడ సానివాడ. దానికి కొంత వారగా తేరగా దక్కిన మాన్యాల వారు, ధాన్యాల వారు, జారులు - పూజారులు అరుగులరిగేట్లు తిష్టించేవారు. లేని కథలు సృష్టించే వారు. నేతిగిలకలవారు, నెత్తి పిలకలవారు, కలవారు - లేనివారు, వారూ - వీరు కలిసి వెలసిన మున్నూరు గడప. రమారమిగా (అంటే... విష్ణువు అనుకునేరు! రమను రమించువాడు గనక విష్ణువు. ఇత్యాది కాకుళీయ సమాసాలు చేసి కర్మధారయకు నీళ్ళు వదిలేసి). తొన్నూరు నెగళ్ళవారు ఈ మట్టి దేవుళ్ళు సామాన్యులా! అటు మహాభోగి ఆంధ్ర విష్ణువుని, ఇటు ఏ భోగం లేని ఏక రాత్ర మల్లికార్జు స్వామివారిని కూడా ఆశ్రయిస్తూ ఉంటారు. ఇటు శుద్ధ వైదీకమూ ఉంది. అటు వీర వైఖానసమూ ఉంది. ఉన్నదేదో ఉంది. ఊరు పచ్చగా ఉంది. ఊహలకు వెచ్చగా ఉంది. అపోహలకూ, నచ్చుబాటుగా ఉండనే ఉంది.

అమరవాది అవధానులుగారంటే.. చుట్టుపక్కాల్లోనే కాదు - చుటు పక్కల దివిసీమంతా పేరు. పేరుగన్న వైదికం, పేరుకున్న ఛాందసం ఉండాల్సినంత ఉంది. ఒక్కగానొక్క కొడుకు. కాశీ వెళ్ళి వచ్చిన తల్లిని గన్న తాతగారితో, కాశీ దాకా వెళ్ళినవారు ఆ పక్కనే ఉన్న రామేశ్వరం కూడా చూసివస్తే పోయేది కదా! అన్నంతటి లోకజ్ఞాని. ఈ మనుమడు. ఇంతకీ పేరు కాశి. కాశీపతి శాస్త్రికి పౌరోహిత్యం పట్టుబడ్డది, దానికి తోడు స్కూలు చదువుతో నాలుగు ఇంగ్లీషు ముక్కలు కూడా పట్టుబడ్డాయి. దరఖాస్తులు, దస్తావేజులు, కోర్టుకాగితాలు చదివేపాటి, చదివి అర్ధం చెప్పే పాటి సులువూ పట్టుబడటంతో పట్టపగలంతా వాడి గిరాకీ పట్టపగ్గాల్లేకుండా పోయింది. వీటన్నిటికీ తోడు అతని రూపం సుందరం. గాత్రం సుమధురం. కాసుల పురుషోత్తమ కవిగారి 'ఆంధ్ర నాయక శతకం' కంఠస్థం. ఆ పైన దైత గోపాలంగారి శిష్యరికంతో వచ్చిన సక్కుబాయి పాటలు, తుంగల వారికీ మేలుబంతిగా అతని వన్నెకువాసి తెచ్చి పాలేళ్ళూ,

పంటకాపులూ, వర్తకులూ - వస్తాదులూ కూడా అతన్ని మెచ్చేవరకూ - వెంబడించే వరకూ వచ్చింది. ఇప్పుడు కాశీ ప్రభ వెలిగిపోతూ ఉంది. తాత తండ్రుల మాన్యాలు - మన్ననలు, ధనాలు - కనకాలు సరేసరి. రెండు చేతులకి రాళ్ళ ఉంగరాలు అథవా నాలుగైనా ఉండేవి. ఏనాడో శ్రీనాథులవారు వారున్న నాటికే సూటిగా భవిష్యత్తును కూడా పరకాయించి చూసి అననే అన్నారు కదా!

*"ధరియింప నేర్చిరి ధర్భ పట్టెడు వ్రేళ్ళ*

*లీలమాణిక్యాంగుళీయకములు"* అని -

అందులోనూ దబ్బపండుకన్న నిమ్మపండల్లే, హరి చందనపు ఉండల్లే, బంగారు కొండల్లే నిగనిగలాడుతూ.. వయస్సులో ఇప్పుడున్న వాళ్ళకీ - వెనకెప్పుడో ఉన్నవాళ్ళకీ కళ్ళకద్దుకునేటట్టు ముద్దుగా ఉండేవాడు కాశి. అందరి కళ్ళూ తన మీద వాలుతుంటే.. తన చూపులు కొంచెం పైగానో, కిందుగానో, గాలిలోనో, నీటిలోనో, తేలుతూనో - మునుగుతూనో ఉండేవి.

ఒకనాటి వేసంగి మధ్యాహ్నవేళ కృష్ణలో జలకమాడి, సంధ్యా వందనం పూర్తి చేసుకుని, అంగాస్త్రం ఝాడించుకుని వెనుదిరిగే వేళకు గట్టుదరి బుడగలు బుడగలై ఉడుకుతున్న కృష్ణవేణమ్మ నట్టు వాంగం చూసి అట్టే నిలిచిపోయాడు కాశి. నాచు పాపలై - నీటి నీడలై - ఏటి పాపలై కదులుతున్న చేపలూ. ముక్కుముట్టని, గొంతు దాటని, పొట్ట నిండని ఈ ఏటి కూళ్ళకోసం అలిసి అవిసె పువ్వుల్లా పడివున్న కొంగలు. ముక్కు మూరెడున్నా నీళ్ళు నోరైనా దొరకని వడగాడ్పులో ఏటి చేప నేసుకోబోయి ఏటిచాప నోట పరుచుకున్న కొంగల నోరంతా ఇసకసకాగా.. ఈ విడ్డూరాలు చూస్తూ మరచిన ఒడ్డు ఎక్కబోయాడు కాశి.



ఈనాటి శ్రీకాకుళాంధ్ర మహా విష్ణువు దేవాలయం

ఇప్పుడా ఒడ్డు ఒయ్యారంగా ఉంది, దానికి నడుమొచ్చి ఉయ్యాలలూగింది. బెంగచూపుల కళ్ళలో బేడిస కిలుక్కుమంది. ఆ పడుచు ఉతకబోయిన ఓణీ ఏరెత్తికెళ్ళింది. ఏరు మొల దాటేసరికి వెతకబోయిన మోహినీ ఎదనెట్టే ఏటికెదురీదసాగింది. ఈత ఆగదు - పాత అందదు. ఈ తపతపలకి కొంగ రెక్కల రెపరెపలు. కృష్ణవేణమ్మ నవ్విందా అన్నట్టుగా ఉంది. మధ్యాహ్న దరిద్రంతో అలమటిస్తున్న ఆ ఇసక మేటలో.. ఈ సౌందర్యలహరీ ప్రవాహం. చూడడానికి రెండు కళ్ళూ చాలకపోయె. పైటందని, నీటి పాటందని చిన్నది చిక్కులో పడింది. ఆ పాత కోసం పోగా పోగా పాతాళమే గతి అయ్యేటట్టు వుంది. అది లేకుండా ఊరు చేరాలంటే ఎట్లా? నీటి చీర కట్టు జారిందా నీతి కట్టు జారినంతపనాయె. ఏటి కోకతో ఎన్నాళ్ళుండేను? పాటిరేవు పడితే పరువేమయ్యేను? వరదొస్తే వరదంటి వయసు ఏ గట్టు చేరేను? తన గుట్టు తన లంకకే చేటు కదా? వణుకు పట్టిన మైతీగ ఏటి వాగల మీటు కెన్నాళ్ళు తాళేను - తాళం వేసేను?

ఇదంతా చూస్తున్న కాశీ ఒడ్డెక్కలేక, ఎక్కకుండా ఉండలేక, బిక్కుమంటున్న చక్కంది చూసిన జాలి చూపు మింగలేక, అంగాంగ సౌందర్య గంగకు సారెగా తన అంగవస్త్రం అందించాడు. అంగనామణి ఆ అంగవస్త్రాన్ని చెంగుగా వక్షోజాల మీద ఆచ్ఛాదన చేసుకుని ఆలింగనం చేసుకున్నంతగా ఏటి నీటి నిలువుటద్దాన కనపడేసరికి గంగవెర్రులెత్తినంత... కామ కటాక్షం కలిగినంత.. కౌగిలింత కల దాటి కట్టెదుటికి వచ్చినంత.. ఆ కాంత తనకిచ్చినంత.. ఎంతెంతో ఆ వెచ్చనంతా... వేడుకగా తోచి, వేడెక్కి పగటి కల కన్నాడు కాశీ. చూపు చుట్టరికం కలిపింది. అంగవస్త్రం కట్టుకుని నిలబడ్డ కన్నె గాలి నడుము పేదరికం తెలిపింది. మడుగుకు అడుగులొత్తుతూ మెత్తగా తూలుతూ, తుళ్ళుతూ ఆమె ఒడ్డుకు రాబోయి ఆగింది. ఆమె చూపు పైట దారిని పడి మూగగా కళ్ళకు చేరి ముత్యమంత కన్నీటి బొట్టు రాల్చింది. ఆ మూగచూపు కాశీ అయిదు ప్రాణాలనూ ఆచమ్యా అంటూ పిల్చింది. అంతే తనకు వచ్చీరాని ఈతతో నదికి అడ్డం

పడ్డాడు కాశీ. నడిచాడో.. పరుగు తీశాడో.. పాకాడో... దేకాడో పడుచమ్మ పైట పట్టుకున్నాడు. అనామిక బొడ్డులోంచి ఓ నవ్వు పుట్టి పెదాల మీద కొచ్చి పూసింది. ముంగురుల తడి ముత్యాల తెర నుంచి ఆమె వెన్నెల నవ్వులు కాలే ఏండకు గొడుగేసి కాశీ గుండెకు వల వేశాయి.

పైటనిచ్చిన పడుచువాడికి సిగ్గులు కృతజ్ఞత చెప్పాయి. చూపులు ఎరుపులై, పిలవని పిలుపులై, కాశీని కాములవారి గుడి తలుపులు తీసి రమ్మన్నాయి. ఇదంతా కాశీ మానసికం.

కాదంటే స్వప్న జగత్తు. లేదా మదన మహత్తు.

పైటనందుకుని, తడిసి మోపెడైనదాన్ని పిండుకొనబోయి, కాశీపతులవారి అంగవస్త్రాన్ని జారకుండా మునిపంట పొదిపి, చివళ్ళ చంకనెట్టుకుని వంగింది ఆ పడుచు దొరగా.. అదో రకంగా కాశీ వంక చూస్తూ... అద్దరినెందరున్నా – ఏటికిద్దరిని వీరిద్దరే. పైట చేతబట్టి తెచ్చిన కాశీ పునఃస్నానం చేయలేదు. అంగవస్త్రం ఎంగిలించిన అంగన దాన్ని నీట తడపనూ లేదు. అంటు అంటూ లేదు. అనుకున్నవారూ లేరు. వారిద్దరి మధ్య ఇంత జరిగినా మాట – మంచీ సుంతైనా లేదు.

చేపల కోసం కొంగ జపం సాగుతూనే ఉంది. చేపట్టే వాడి కోసం కన్నెతనం కాగుతూనే ఉంది. చేతికొచ్చిన అవకాశం అందంగా ఉంది, అందుబాటులో ఉంది. చదివిన ఛప్పన్న శాస్త్రాలూ, చెప్పుచ్చుక్కొట్టినా చెప్పిన మాట వినేటట్టు లేదు, అమరవాది వారి అబ్బాయి.

అవునుమరి కొమ్మన్నగారి మనుమడేగా!

ఈ కొమ్మన్నగారు గుంటూరి వారు కాదు. ఆ కొమ్మన్నగారి గుణాలన్నీ పుణికిపుచ్చుకున్న వేదం వారి అంతే వాసులు. అమరవాది కొమ్మన్న శాస్త్రిగారికి సాక్షాత్తూ పౌత్రుడు మన కాశీపతి శాస్త్రి. మహాయాజ్ఞికులు, అపర యాజ్ఞవల్క్యులు తిక్కశర్మగారు.. అదే మన గుంటూరి కొమ్మన్నగారి పుత్రులు. దరిమిలా యజ్ఞం చేసి సోమయాజులై తండ్రిగారిని తృతీయం తర్వాత చతుర్థ పురుషార్థానికి నడిపించి పుత్రుడుగా చేయవలసింది చేశారు. 'భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్ తెనిగించి భారతామృతము కర్ణపుటంబుల గ్రోలి ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ' చేసిన ప్రాతః స్మరణీయులు – పునరపి అన్నట్లు గురు మానస పుత్రుల జాతకమూ.. అదే మన కాశీపతి పితామహుల జాతకమూ. కామకోటికి వచ్చి ముక్తి కాంతానుగ్రహం కోసం, వాకిట నిలిచి వాటారి పోయింది. ఆ వంశాంకురమే కదా కాశీ. తాతపేరు నిలపవలసిన వాడాయెను. ఆ పేరు నిలపడానికి ఉన్న పేరు.. అదే తన తండ్రిగారికిన్న మంచిపేరు కృష్ణలో కలపడానికి ఇప్పుడీ అవకాశం, అనుకోకండా, అందంగా, అందే విధంగా ఆడదై వచ్చింది.

నడి వేసంగి. మిట్ట మధ్యాహ్నం. అయితేనేం కాకుళీయ కామ పరిషత్తులో వేళపాళ, ఎక్కువ తక్కువ, కులం గోత్రం – వేదం శాస్త్రం, మంచి చెడ్డలు, మట్టిగడ్డలు శృంగారానికి పాటించవలసిన పనిలేదని ఏనాడో తేల్చి వేశారు. అసలే దివిసీమ. అందులోనూ క్రీడాభిరామంగా వెలిసింది శ్రీకాకుళం.

*సురలే నరులట అచ్చట*
*సురుచిర నిమేష నేత్రులు*
*నరులే సురులట నిచ్చలు*
*జరాభావ రసగాత్రులు*

అంతా దివ్యమే...భవ్యమే!

'ఇంతకీ ఎవరయ్యా ఆ ఇంతి? పులకలు పుట్టించే పూబంతి? ఈ నలరాజును వరించడానికి వలరాజు నదీతీరానికి పంపిన దమయంతి? '

వచ్చే కాకుళపు తిరునాళ్ళకు - కట్ట కింద తిరునాళ్ళని కూడా పేరు - రైకల పండగ రేనాళ్ళకు ముందుగానే దిగుతారు వక్కలగడ్డ నుంచీ, మురమండ మేళం నుంచీ, వేల్పూరు వాడల నుంచీ, తణుకు నుంచీ, తాడేపల్లి నుంచీ, నంగిగడ్డనుంచీ, కడప శివారు కోడూరు నుంచీ - విశేషించి వికట కవిత్వాల రామలింగయ్య గారి తెనాల్యగ్రహారం నుంచీ, ఆనంద గజపతుల సీమలో కటకం నుంచీ, విజయనగరం నుంచీ, మల్లెమొగ్గల వారు మంచి గంధం వారు, మంగళం పాడు వారు, చుట్టాల సురభివారు, పువ్వుల వారు, పూజల వారు - వారి వారి విద్యలతో వీరంగాలతో శ్రీకాకుళానికి తరలి వస్తారు.

అట్లా వచ్చి, వన్నెల పందారాలు చేసి, వారి వారి తావులకు మళ్ళే ఈ జనాభాలో ఒకరో ఇద్దరో, మేళాల వారో మేజువాణీల వారో కొన్నాళ్ళపాటు శ్రీకాకుళంలోనే ఉండిపోవడం కద్దు. అందులో ఏటా ఒక్క కుటుంబం వారైనా నట్టువాంగం నేర్పులతోనో, భామాకలాపాల ఆట ఒడుపులతోనో, సానివాడ కూనలకు విద్య నేర్పే పని మీద ఉండడమూ కద్దు. వారిలో కొందరు కృష్ణలీలా విశేషాలను ఆకళింపు చేసుకుని అభినయంలో దిట్టలనిపించుకోవాలని పురాణేతిహాసాలు తెలిసిన పండితులను, తలపండితులను సగౌరవ లాంఛనాలతో వాడలో వారి ఇళ్ళకు పిలిచి సత్కరించడమూ కద్దు. సాధన చేయడమూ కద్దు.

కద్దు కద్దు అంటూ కళ్ళ కద్దుకున్న కళలకు కాణాచి విజయనగరవాసిని భోగిని, కాశీ పితామహులను ఆ విధంగా ఆశ్రయించినదై మనసు నిండుగా కృష్ణ మాయలూ, మర్మాలూ మనసు తీరగా గీతలూ - వేదాంతాలూ మనసు తీరని గారాలూ, శృంగారాలూ అన్నీ నేర్చినదే నేర్చుకుంటున్నట్టు నేర్పుగా కొమ్మన్నగారి నీడను.. తలను రసికతలను దాచుకున్నది. ప్రత్యక్ష గురుత్వమేమో శాస్త్రిగారిది.. పైగా పడుచుదనం దోరగా పలకమారే వయసేమో... ఆ కాంతను అయస్కాంతను, ప్రియస్వాంతను ఆసాంతం సొంతం చేసుకున్న వారై, కృష్ణ కృష్ణ అనుకున్నంతలో నెల పొడిచి తొమ్మిదింట నెలవంక నవ్వులది ఓ వెలది పాప పుట్టింది. పుట్టింది పెరగడానికే అన్నట్టు పెరిగి పెద్దమనిషి అయింది. అటు తర్వాత కాశీరాజుగారి కొలువు పేరంటానికి భోగినిని రమ్మని గజపతుల నుంచి పిలుపు మేనాతో వచ్చింది. ఇటువంటి సందర్భాల్లో గుడ్డు తల్లిని వెక్కిరిస్తుంది, అందుకనే ఆ కన్నపాపను, కన్నెపిల్లను తిరిగొస్తే సరే... లేదంటే దాని ముద్దూ, ముచ్చటా మీరే. చూసుకోండి అంటూ కళ్ళంట నీళ్ళెట్టుకుని భోగిని వెళ్ళిపోయింది.

అందాల భరిణలో ముద్దమందారమూ అన్నట్టుగా పైటకెదిగిన దీక్షితదుహిత 'నాన్నగారూ' అంటూ కొమ్మన్నగారి ఇంట్లోను, ఇంటి పనుల్లోనూ తిరుగుతుంటే.. ఓనాడు నట్టువాంగాల ఉయ్యూరుగాడు వచ్చి మాగూటి చిలకను, మా గువ్వకే ముడిపెట్టమన్నాడు. కాకపోతే నెమలి పాడితే వినాలని - కోకిల ఆడితే చూడాలని అనుకున్నట్టే అవుతుందని అన్నాడు.

'పెళ్ళి!' కొమ్మన్నగారి ఎర్ర నెత్తురు తెల్లమొగం వేసింది. తండ్రి బిడ్డగా ఇది బ్రాహ్మణి -తల్లి వరుసగా సాని. మమకారానికి - వావీ వరసా లేవు. అప్పటికే ప్రాయపు సూర్యుడు పడమటికి చేరిన కొమ్మన్నగారికి వల్లమాలిన దుఃఖం వెల్లువై వచ్చింది. శాస్త్రిగారు జీవన్మృతులై భాష్పగంగలో వారికి సశరీర నిమజ్జనం జరిగింది. కాకుళేశుడి గుడి ధర్మకర్త రాజబంధువు అంకినీడు నాయుడు కొడుకుతో పెళ్ళీ పేరంటం అన్నీ జరిగిపోయాయి. ఆ తర్వాత రాజ బంధుత్వం రాబందుగా మారి, కులం వారిలో రాజ బంధువుల్లో పిల్లలుండగా ఇదేమిటని, కథేమిటని కాకులై పొడిచి చిన్న అంకినీడుకు మళ్ళీ పెళ్ళిచేశారు.

బొమ్మల పెళ్ళిగా జరిగినా అమ్మను చేసి వెళ్ళాడు అంకినీడు కొడుకు. భోగిని కూతురు యామిని ఇప్పుడు తల్లి, తాళి పడ్డ చోట తల్లి కాలేదు యామిని. తను పుట్టినపుడు తల్లికి పురుడు పోసిన వాడ వదిన సామ్రాజ్యం తనకూ పురుడు పోసింది. యామిని కడుపున మళ్ళీ భోగిని పుట్టింది. ఎదిగిన పదారేళ్ళ కాలం ఇంటిపనులకే సరిపోయె. వంటలకూ వార్పులకూ చేతులు కాలిపోయె. చాకిరేవులకే కొలువాయె. ముద్దులూ లేవు, మురిపాలూ లేవు. మువ్వలూ లేవు - మువ్వ గోపాల పదాలూ లేవు. ఇంటికొచ్చే పూట కాపరాల వారికి సపర్యలూ - సల్లాపాలు, సన్నజాజులూ - చాటు ముద్దులు - ఇలా గడిచిపోతూ ఉంది.

సామ్రాజ్యం ఇంట్లో సందె పేరంటాలు సన్నగిల్లాయి. కొత్త నీరు వచ్చి పాత నీరు పల్చబడ్డట్టు అయింది. యామిని బతుకు ఎడారిలో ఎండమావి. ఒక వీసం వైరాగ్యం.... ఆమె చూపు లోను, పలకరింపులోను. ఇపుడు ఈ బిడ్డ పుట్టిన తర్వాత ఉన్మాదంగా మారింది, పిచ్చిపాటలు! అంకినీడు బతకనీడు. చావనీడు. వాడు మోడు. నేను బీడు. బతుకు పాడు అనటం వెర్రిగా నవ్వడం. కంట్లో ఈతముల్లు గుచ్చుకుని పువ్వు పూసిందని కొందరు - కంటి నలకను ఈత ముల్లుతో తీసుకుంటే ఏమవుతుందని కొందరు, దెప్పడంతో ఉన్న మతి కూడా పోయింది యామినికి. నంగిగడ్డలో నగరాజ కుమారి మంత్రం పెడితే యామినీ పూర్ణచంద్రికలు, పున్నములవుతాయని, వాడవారు, వరసవారు చెప్పగా బండి కట్టించారు. కాకుళం దాటగానే గుండేరు - అదొక వాగు. ఆ వాగులో అన్నీ గుండ్రాళ్ళే ఇసకపాలు తక్కువ. దాని రాకడ, పోకడ అంతు బట్టదు, బండి కదిలే వేళకు దుక్కివాన కురిసింది. బండి కదిలి గుండేరు చేరేసరికి - అది నిండుగా కూర్చుంది. ఈ బండి నడివాగులో చిక్కుకుంది. వరదలో కొట్టుకుపోయిన యామిని, జీవితపు ఆవలిగట్టుకు చేరింది. అంతా కథలాగా జరిగిపోయింది. ముదిసాని సామ్రాజ్యం కొంపలో చిన్న భోగిని చిరుదీపమై మిగిలింది. అందంతో అభిసారిక కావలసింది - పరువంతో పరిచారికగా మారింది. ఎవరు మెచ్చేను ఎత్తుబడ్డ సామ్రాజ్యం తప్పు! ఇంట్లో ముసలిదాని వేధింపు పడలేక కాస్త గాలి పీల్చుకుందాం అనే వేళకు గుళ్ళో నైవేద్యం గంట మోగింది. అప్పుడు కృష్ణకు బయలుదేరింది చిన్న భోగిని. కాశీతో చూపుల సంభోగం అప్పుడే జరిగింది. ఆమె వరకు ఎండ వెన్నెలగావుంది. ఆ వెన్నెల్లో గొడుగు పట్టేందుకు తగ్గవాడే ఒకడు, కడుచక్కనివాడు, మనసెక్కినవాడు - కాశీ దొరకనే దొరికాడు.

పరువాన్ని పరువంతో పుటం పెడితే, అందాన్ని అందంతో రంగరిస్తే - వయస్సుని, వాంఛని వడబోత పెట్టుకుంటే, సిగ్గుని చిగురించే కోరికని చిత్రిక పట్టుకుంటే, వడదెబ్బని వడపప్పుగా నమిలి మింగితే ... పులకింతల పూనకంలో వలవంతల పూనకం ముద్దుగా తాగితే ఈ దప్పి తీరేనా? ఎద నొప్పి జారేనా! అనుకున్నంతలో పైకి అనలేనంతలో అంగవస్త్రం అందుకుంటూ ఆమె చేతులు స్పృశించాడు కాశి. ఆమె నవ్వింది. నవ్వుతే నాదనిపించింది. మౌనంతో మనది అనిపించింది. ఈ చెయ్యి, ఆచెయ్యి కలపడంతో, దులుపుకోడంతో, ఈ బంధం ఇప్పటిది కాదు అనిపించింది. ఈ రాసలీలకు ఆకాశంలో అగ్నిసాక్షి. భూలోకంలో కృష్ణవేణమ్మ సాక్షి. రతి స్పర్శ, రాగ స్పర్శ జ్ఞాతంగా అజ్ఞాతంగా జరిగిపోయాయి. "అవసర పతితావాణి అలంకార రహితాస్తు శోభతే, పతితాం, అవసర గామీ నారీ భూషాహానిస్తు శోభతే, పతితాం, అవసరగామీ నారీ భూషాహానిస్తు శోభతే, పతితాం, అవసరగామీ నారీ భూషాహానిస్తు శోభతే, పతితాం, అవసర గామీ నారీ భూషాహానిస్తు శోభతే పుంసాం" - ఇదే కదా ఆ కాకుళేశుడి వైష్ణవ మాయ!

అట్టట్టా ముదిరిన చనువు మళ్ళీ నట్టేట ముంచింది. ఇద్దరినీ జలక్రీడలకు తార్చింది. లక్ష్మణ కవి గారన్నట్టు జలముల నగ్ని! పైటా అంగాస్త్రం కూడాబలుక్కున్నాయి, అంగాంగాలు ఆదమరిచి పోయాయి, ఆడా, మగతనాలు అర్ధనారీశ్వరపురంలో గుడి కట్టుకున్నాయి. అప్పుడే స్వామివారికి నివేదన పూర్తయినట్టు సుదూరాన గుళ్ళో మళ్ళీ గంట మోగింది, మూడు తరాల అజ్ఞాత కథకు కృష్ణవేణిలో నిమజ్జం జరిగింది.

ఇంతకీ సానివాడలో ఒక సామెత ఇప్పటికీ మిగిలిపోయింది.

*శ్రీకాకుళే మహాక్షేత్రే*

*గుండేరే మహానది*

*ఈతముల్లే ప్రాణ హాని*

*అంకినీడే అధోగతి.*

✡✡✡